

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, అక్టోబర్ 19 : ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ మహేందర్ జీతో కలిసి ఎన్నికల నిర్వహణపై మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ బాధ్యతలు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. 24/7 టీవీలో వచ్చే వీడియో ప్రకటనలు, పత్రికా ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌పై నిఘా పెట్టి, రోజు వారీగా నివేదికలు అందజేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో ఎంసీఎంసీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పెయిడ్ ఆర్టికల్స్ గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం వంటివి చేయాలన్నారు. అలాగే, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలను సకాలంలో ఆమోదించి మంజూరు చేయాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా ర్యాండమైజేషన్ ద్వారా ఎన్నికల సిబ్బందిని కేటాయించాలన్నారు. పోలింగ్ సిబ్బంది, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌తో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సిబ్బంది కొరత లేకుండా తక్షణమే ఇతర శాఖల సిబ్బందిని తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో గణేశ్, సీపీవో సత్యనారాయణరెడ్డి, డీఈవో అబ్దుల్‌హై, ఎంసీఎంసీ సభ్యులు లక్ష్మణ్‌కుమార్, భూపాల్, కృష్ణారెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## నేచురోపతి నర్సింగ్ అసిస్టెంట్‌లో శిక్షణ

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 19 : ఆరోగ్యాన్ని సంరక్షించుకునేందుకు నేచురోపతి నర్సింగ్ అసిస్టెంట్ సేవలు చాలా అవసరమని, దేశంలో వీరి సంఖ్య తగినంత లేనందున నిరుద్యోగులకు జీవనోపాధి కోసం ఇందులో శిక్షణ అందించనున్నట్లు సెంటర్ ఫర్ నేచరల్ హీలింగ్ థెరపిస్టు వ్యవస్థాపకుడు, కన్సలెంట్ కే శ్యాంసుందర్‌రావు తెలిపారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 6 నెలలు ఉండే ఈ దూరవిద్య కోర్సు ప్రారంభంలో మొదటి మూడు రోజులు స్వయంగా తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. శిక్షణలో సెల్ఫ్‌కేర్, హెల్తీ లైఫ్‌స్టైల్, నేచరోపతిలో ఉయోగించే చికిత్సవిధానాలు, డెటోసిఫికేషన్ ఆఫ్ బాడీ, యోగా, ఫ్రీహ్యాండ్ ఎక్సర్‌సైజెస్, ప్రకృతిసిద్ధమైన ఆహార విధానాలు, వెయిట్ రెడ్యూక్షన్ ప్రోగ్రాంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే, ఆరో నెలలో ఏదైనా ఒక ప్రకృతి చికిత్స వైద్యశాల ఇంటర్న్‌షిప్ ఉంటుందని, దీర్ఘకాలిక వ్యాధుల రోగుల వద్ద నర్స్‌గా సేవలందిస్తూ, బరువు తగ్గించే ప్రోగ్రాం ద్వారా, ఇతరులకు శిక్షణ అందించవచ్చని తెలిపారు.



షమితకు పుష్పగుచ్ఛం ఇచ్చి, అభినందనలు తెలుపుతున్న ప్రొఫెసర్లు

## కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగాధిపతిగా ప్రొఫెసర్ షమిత

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 19 : కాకతీయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగాధిపతిగా ప్రొఫెసర్ జీ షమితను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రస్తుత విభాగాధిపతి డాక్టర్ మామిడాల ఇస్తారి నుంచి గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. షమిత గతంలో విభాగాధిపతిగా, పాఠ్యప్రణాళిక అధ్యక్షురాలిగా, మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులుగా, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్‌గా పనిచేశారు. ప్రస్తుతం కేయూ కేంద్ర గ్రంథాలయ ఇన్‌చార్జిగా, అకడమిక్ ఆడిట్ డీన్‌గా కొనసాగుతున్నారు. ప్రొఫెసర్ షమిత పర్యవేక్షణలో నలుగురు పరిశోధకులు డాక్టరేట్ పూర్తిచేశారు. ఈ సందర్భంగా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు

- శ్రీలలితా మహాత్రిపుర సుందరిగా వేయిస్తంభాల రుద్రేశ్వరీదేవి
- లలితాసహస్రనామాలతో వేదోక్తంగా లక్షపుష్పార్చన



హనుమకొండ చౌరస్తా : వేయిస్తంభాల గుడిలో అమ్మవారికి లక్షపుష్పార్చన చేస్తున్న గంగు ఉపేంద్రశర్మ



న్యూశాయంపేట : అన్నపూర్ణేశ్వరిగా కొలువుదీరిన అమ్మవారు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 19: నగరంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో ఐదో రోజు గురువారం శ్రీరుద్రేశ్వరీదేవిని శ్రీలలితా మహాత్రిపుర సుందరిగా అలకరించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధార్మికవేత్తలు నీలం సుహాస్ దంపతులు, పీ కిశోర్ దంపతులు ఉభయదాతలుగా విజయవాడ నుంచి తెప్పించిన లిల్లీ, చామంతి, గులాబీ, మల్లె, గన్నెరు, సంపంగి పూలతో లలితాసహస్రనామాలతో వేదోక్తంగా లక్షపుష్పార్చన నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. అనంతరం లలితా త్రిపురసుందరిని సూర్యవాహనంపై ఊరేగించినట్లు పేర్కొన్నారు. గణపతి నవగ్రహ రుద్రహోమం అనంతరం దుర్గాసప్తశతి 18 అధ్యాయాలతో హోమం నిర్వహించారు. దసరా సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. వైదిక కార్యక్రమాలను పెండ్యాల సందీప్‌శర్మ, గంగు ఉపేంద్రశర్మ, ప్రణవ్, కాశీనాథం నిర్వహించగా అన్నప్రసాద వితరణలో గంద్రాతి రాజు, పల్లం రమేశ్, కోన శ్రీకర్, పులి రజినీకాంత్ సేవలందించారు. నేడు రుద్రేశ్వరీ దేవికి లక్షతులసీ అర్చన నిర్వర్తించనున్నట్లు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ఈవో వెంకటయ్య పర్యవేక్షించారు.

**అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారు**

న్యూశాయంపేట : దేవీ శరన్నవరాత్రోత్సవాలు పురస్కరించుకొని గ్రేటర్ 31వ డివిజన్ న్యూశాయంపేటలోని రాజరాజేశ్వర దేవాలయంలో ఐదో రోజు అమ్మవారు అన్నపూర్ణేశ్వరి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారిని అన్నపూర్ణేశ్వరి మాతగా అలంకరించి, పూజలు చేశారు. అర్చకుడు పానుగంటి నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

## పద్మాక్షి అమ్మవారికి చీఫ్‌విప్ పూజలు

హనుమకొండ, అక్టోబర్ 19 : పద్మాక్షి కాలనీలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో ఘనంగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా 5వ రోజు పద్మాక్షి అమ్మవారు స్కందమాతా(ఉపాంగ లలితా) అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించినట్లు అర్చకుడు నాగిళ్ల శంకర్ శర్మ, వేద పండితుడు నాగిళ్ల షణ్ముక పద్మనాభ అవధాని తెలిపారు. కాగా, అమ్మవారిని చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సద్దుల బతుకమ్మ ఆటస్థలాల్లో మౌలిక వసతులు కల్పించాలి

**గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా**



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, అక్టోబర్ 19 : తెలంగాణ ఆడబిడ్డల పండుగ సద్దుల బతుకమ్మ ఆట స్థలాల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఆయన అధికారులతో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సద్దుల బతుకమ్మ, రావణ వధ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లు చేసేందుకు ఎన్నికల సంఘానికి రెండు జిల్లాల కలెక్టర్ల ద్వారా రెండు సార్లు లేఖలు పంపినప్పటికీ ఎన్నికల సంఘం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాధానం రాలేదన్నారు. సద్దుల బతుకమ్మ ఆడుకునేందుకు పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆట స్థలాల్లో బల్దియా ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. నగరంలో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరగే ఉర్సు రంగలీలా మైదానం, చిన్న వడ్డేపల్లి చెరువు, బెస్తం చెరువు, కాశీబుగ్గ(పద్మానగర్), మెట్టు దర్వాజ, శాంతినగర్, శివనగర్ బతుకమ్మ కుంట, బంధం చెరువు, పద్మాక్షి గుండం తదితర 14 చెరువుల వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు. బతుకమ్మ ఆట స్థలాల్లో లైటింగ్, సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, పారిశుధ్య పనులను చేపట్టాలని ఆదేశించారు. బతుకమ్మలు వేసే చెరువుల్లో గుర్రపు డెక్కను వేగంగా తొలగించాలన్నారు. ఇప్పటికే చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు కమిషనర్‌కు వివరించారు. సమావేశంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈలు శ్రీనివాస్, సంజయ్‌కుమార్, పీఆర్వో ఆయూబ్ ఆలీ, డీఈ రవికుమార్, రవికిరణ్, ఏఈ హబీబుద్దీన్ పాల్గొన్నారు.

## రైల్వే రిటైర్డ్ కార్మికులకు అండగా ఉంటా

**చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్**

కాజీపేట,అక్టోబర్ 19 : రైల్వే రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుంటానని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గ్రేటర్ 62వ డివిజన్‌లోని రైల్వే రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో సంగమయ్య అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చీఫ్‌విప్‌తో పాటు వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ కాజీపేట రైల్వే ప్రాంతం అభివృద్ధికి రైల్వే పెన్షన్‌దారులు ఎనలేని కృషి చేశారన్నారు. రిటైర్డ్ కార్మికులకు ఓ కొడుకుగా, తమ్ముడిగా ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. విశ్రాంతి తీసుకునే సమయంలో సమాజం కోసం కృషి చేస్తున్న రైల్వే పెన్షనర్లు అభినందనీయులన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కేవీ రావు, కోశాధికారి ఐలయ్య, సురేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

## రేపు ఏవీవీ కాలేజీలో మెగా జాబ్‌మేళా

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 19 : నిత్యావసరాలను కేవలం 10 నిమిషాల్లోనే డెలివరీ చేసేందుకు నగరంలో తొమ్మిది 'డోసిల్‌కార్ట్' స్టోర్లను త్వరలో ప్రారంభిస్తున్నామని, ఇందులో 513పైగా ఉద్యోగావకాశాలను నగర యువతకు కల్పించడానికి శనివారం ఏవీవీ కాలేజీలో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు డోసిల్ కార్ట్ చైర్మన్ ఎస్ క్రాంతికుమార్, డైరెక్టర్ నాగశృతి తెలిపారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఇప్పటివరకు మెట్రో నగరాలకే పరిమితమైన డోసిల్‌కార్ట్‌ను మొదటిసారిగా నగరంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందులో స్టోర్ మేనేజర్లు–18, అసిస్టెంట్ స్టోర్ మేనేజర్లు–18 చొప్పున పోస్టులు ఉన్నాయన్నారు. అలాగే, పిక్కర్స్–72, డెలివరీ బాయ్స్–360, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్–45 పోస్టుల భర్తీకి ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు సర్టిఫికెట్స్, 4 ఫొటోలు, ఆధార్, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌తో హాజరుకావాలని సూచించారు.